

నేడు నూజివీడు బాలోత్సవం

రెండో పిల్లల సంబరాలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు బాలోత్సవం రెండో పిల్లల పండుగ ఈ నెల 21న ఆదివారం స్థానిక సెయింట్ థామస్ పాఠశాల ఆవరణలో జరగనుందని బాలోత్సవాల నిర్వాహణ కార్యదర్శి కాసాని గాంగేయుడు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ నూజివీడు బాలోత్సవం జరగనుందని, దీనికి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల విద్యార్థులు సుమారు 2,500 మంది రానున్నారని చెప్పారు. 38 అంశాల్లో మూడు కేటగిరీలుగా పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. బాలోత్సవాలను విజయవంతం చేయాలని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వి.రాఘవరావు, బిఎల్బి.కోటేశ్వరి కోరారు.

పింఛన్లపై దొంగాట..!

'నిడమర్రు మండలం అడవికొలనుకు చెందిన బొడ్డు సూర్యారావు పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యారు. లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలి. ఇప్పటి వరకూ ఇతనికి వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నారే తప్ప.. పక్షవాతం వచ్చిన వారికి ఇచ్చే పింఛన్ ఇవ్వడం లేదు. లేవలేని స్థితిలో ఉన్న సూర్యారావుకు వైద్యులు 75 శాతం అంగవైకల్యం ఉన్నట్లు చూపడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తనకు రూ.15 వేలు పింఛన్ అందించాలని అధికారుల చుట్టూ కుటుంబసభ్యులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు'.

'ఏలూరు కత్తేపువారి వీధికి చెందిన బూరగ మోషే పక్షవాతంతో వెన్నుముక, నరాలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేసింది. రూ.15 వేలు పింఛన్‌కు అర్హతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి'.



పక్షవాతంతో బాధపడుతూ రూ.15 వేల పింఛన్ కోసం ఎదురుచూస్తున్న బాధితుడు సూర్యారావు

- జిల్లాకు 200 మాత్రమే కొత్త పింఛన్లట
- ఏలూరు జిల్లాలో 20 వేల మంది, పశ్చిమలో 18 వేల మంది వరకూ ఎదురుచూపు
- పక్షవాతం బారిన పడినవారికీ రాని పింఛన్లు
- కొత్త పింఛన్ల మంజూరుకు కూటమి మొండిచెయ్యి
- పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో అత్యధికం పింఛన్లే
- ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సూర్యారావు, మోషేనే కాదు. జిల్లాలో కొత్త పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల మంజూరు అనేది లేకుండాపోయింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే భార్యలకు స్పౌజ్ పింఛన్లు మంజూరు తప్పితే, ఏఒక్కరికీ కొత్త పింఛన్ ఇవ్వలేదు. దీంతో పింఛన్ల కోసం అర్హులంతా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో అత్యధికం రెవెన్యూ, పింఛన్ దరఖాస్తులే ఉంటున్నాయి. దీంతో అధికారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అధికారుల అంచనాల ప్రకారం ఏలూరు జిల్లాలో 20 వేల మంది, పశ్చిమలో 18 వేల మంది వరకూ కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. పిజిఆర్ఎస్‌లో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఏలూరు జిల్లాలో నాలుగు వేల వరకూ ఉండగా, పశ్చిమలోనూ అదేస్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సమావేశంలో సిఎం వద్ద పింఛన్ల అంశాన్ని అధికారులు ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో జిల్లాకు 200 పింఛన్లు వరకూ కలెక్టర్, ఇన్‌ఛార్జి మంత్రి పరిశీలించి ఇచ్చేలా అనుమతివ్వనున్నట్లు తెలిసింది. వేలల్లో పింఛన్ దరఖాస్తులు పెండింగ్ ఉంటే 200 పింఛన్లు ఇవ్వాలని చెప్పడం ఏమిటో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి ఉంది. రాజకీయ అనుకూలురుకే ఈ పింఛన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యులకు అందే అవకాశం ఏమాత్రం ఉండదు. వచ్చే జూన్ నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతోంది. అయినప్పటికీ కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంఎల్ఎలు నిర్వహించే ప్రజాదర్బర్‌లోనూ పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులే అత్యధికం ఉంటున్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు సైతం సమాధానం చెప్పలేని పరిస్థితి. గత ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లను మంజూరు చేసేది. జూన్‌లో ఒకసారి, జనవరిలో మరోసారి కొత్త పింఛన్లు ఇచ్చేవారు. రెండేళ్లుగా ఆ పరిస్థితి లేకపోవడంతో అర్హులైన ఎంతోమంది పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పక్షవాతం పింఛన్ల సైట్ మూత

పక్షవాతంతో బాధపడే వారు రూ.15 వేలు పింఛన్‌కు అర్హులు. మెడికల్ సర్టిఫికెట్ పొందిన ఇలాంటివారు డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సైట్‌ను మూసేసింది. దీంతో పక్షవాతంతో బాధపడే వారికి కొత్తగా పింఛన్ అందే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే ఆ సైట్ తెరిచి పక్షవాతంతో బాధపడేవారికి పింఛన్ అందించాలని అంతా కోరుతున్నారు.

పరిశుభ్రత ప్రతిఒక్కరి దినచర్య

మంత్రి కొలుసు పార్థసారథి



వీధులు శుభ్రం చేస్తున్న మంత్రి, ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గతంకన్నా తగ్గాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. పరిశుభ్రత ప్రతిఒక్కరి దినచర్యలో భాగం కావాలని ఆయన అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలం మోర్సపూడిలో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాధులకు మూలం అపరిశుభ్ర వాతావరణమన్నారు. వ్యాధుల మూలంగా ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమేకాక, శారీరకంగా బలహీనుల వుతారని అన్నారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు గతంకన్నా తక్కువ నమోదయ్యాయని, ఇది ఒక మంచి శుభ పరిణామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతనూ పాటించినప్పుడే వ్యాధులు మన దరిచేరవన్నారు. త్వరలో యంత్రాలు కొనుగోలు చేసి వీధులు శుభ్రం చేయిస్తామన్నారు. గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా లేదని మోర్సపూడి పంచాయతీ కార్యదర్శిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ భద్రు, ఎంపిడిఒ చిన్న రాఘవేంద్రనాథ్, పార్టీ అధ్యక్షులు వాసు, నాని, ఆది, రాము, కిషోర్, అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో మంచి ఫలితాలు సాధించాలి

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ



ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

ప్రజాశక్తి - ఏలూరు

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు మంచి ఫలితాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ అన్నారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ప్రతి మూడో శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని 'పర్యావరణంలో అవకాశాలు' అనే థీమ్‌తో ఆయన ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ మాసంలో పర్యావరణంలో అవకాశాలు థీమ్‌తో నిర్వహించే కార్యక్రమాలు జిల్లాలో వాడవాడలా విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. దీనిలో ప్రభుత్వ సంస్థలు, ప్రజలు భాగస్వామ్యమై పర్యావరణాన్ని కాపాడుకోవడం, వ్యర్థాల నిర్వహణ ద్వారా సంపద సృష్టించడం, పరిశుభ్రతతో ఆరోగ్యకర భవిష్యత్తును నిర్మించడంపై దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. తద్వారా ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహన పెంచి, పరిశుభ్రతను ఒక జీవన విధానంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. వ్యర్థాల నుండి సంపద సృష్టించడం, ఇ-వ్యర్థాల సేకరణ, సురక్షిత రీసైక్లింగు పద్ధతులపై అవగాహన కల్పించడం, చెత్తను తడి, పొడి, హానికర వ్యర్థాలుగా వేరుచేసే విధానాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, చెట్లు సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నీటి సంరక్షణపై దృష్టి సారించామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమై పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ ఎన్‌వి.నాంచారయ్య, సూపరింటెండెంట్లు, రెవెన్యూ వివిధ విభాగాల ఉద్యోగులు, పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టాన్ని వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం సమాచార హక్కు చట్టానికి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అవగాహన ర్యాలీని జెసి ఎంజె.అభిషేక్ గౌడ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారహక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలు అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలోపు అందించాలని, తగిన కారణాలు లేకుండా సమాచారాన్ని ఇవ్వకపోయినా తప్పుడు సమాచారం ఇచ్చినా, అర్ధ సమాచారం ఇచ్చినా సంబంధిత అధికారులు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

ఉపాధి హామీ చట్టంలో మార్పులపై నిరసనాగ్రహం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే పనిలో భాగంగానే దానిలో పలు మార్పులు చేశారని, తక్షణం ఆ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లును వెంటనే రద్దు చేయాలని సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తాడి అర్జునరావు, జంగం రంగారావు, ఎం.కవిత, జె.మరియమ్మ, బొంతు మోహన్‌రావు, షేక్ భాషా, జె.రమేష్, శకుంతలాదేవి పాల్గొన్నారు.



కలిదిండి మండలంలో..



ఆగిరిపల్లిలో

టి.నరసాపురం: పేదల పొట్ట కొట్టేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా, పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ వ్యకాస ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మడకం సుధారాణి, అనుమోలు మురళి, బరగడ కుమారి, శిరీష, అగ్గిరాముడు పాల్గొన్నారు.

కలిదిండి: ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేలా సవరణలు చేసి పేరుతోపాటు పథకంగా మార్చడాన్ని నిరసిస్తూ మూలలంకలో శనివారం 197 బిల్లు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడగా, రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, డివి.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జమ్ముదుర్గ, పి.కనకదుర్గ, వి.మీనాకుమారి, ప్రజాసంఘాల నాయకులు బి.రామ నాగేంద్రరావు, జి.అనిల్‌కుమార్, కె.రమేష్, పి.పెద్దిరాజు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



టి.నర్సాపురంలో..

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

22న మన్యం బంద్‌కు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాలను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న జరగనున్న మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ప్రకటించి, పోలవరం ఆదివాసీ ప్రాంతాలను చేర్చకపోవడం నేతిబీరలో నెయ్యి లేనట్టుగానే ఉందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ చర్య హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పునరావాసం కోసం ప్రత్యేక జిల్లా అని ప్రకటించినప్పుడు ప్రాజెక్టు నిర్మాణం అయ్యేదే పోలవరంలో అని, ఫలితంగా పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు నిర్వాసితులవుతున్నారని, వీరికి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. చివరికి చింతూరు రెవెన్యూ డివిజన్ వారికీ ఇక్కడే పునరావాసం కల్పిస్తున్నారని తెలిపారు. అలాంటప్పుడు రంపచోడవరం మాత్రమే జిల్లాగా ప్రకటిస్తే సగం మంది నిర్వాసితులను వదిలేసినట్లే కదా అని ప్రశ్నించారు. రంపచోడవరం, పోలవరం ఎస్‌టి నియోజకవర్గాలు, షెడ్యూల్ ప్రాంతాలు, 1/70 పీసా చట్టాలు అమలవుతున్న ప్రాంతం అని, రెండూ కలిపి ఒక జిల్లా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన చట్టాల అమలకు ప్రభుత్వ యంత్రాంగం దృష్టి పెట్టడానికి వీలవుతుందని తెలిపారు. రెండు వెనుకబడిన ప్రాంతాలే అయినందున ఈ ప్రాంత అభివద్ధిపై దృష్టి సారించడానికి కార్యాచరణకు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దీనికి పోలవరం ఆదివాసీ, ప్రజాసంఘాల ఆందోళన న్యాయమైందని, దీనిలో భాగంగా ఈ నెల 22న మన్యం బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ బంద్‌కు అందరూ సహకరించి జయప్రదం చేయాలని, ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని చేర్చాలని రవి డిమాండ్ చేశారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడతాయని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని రేచర్ల వాటర్ దగ్గర(ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గర్లో) డిఎఫ్ఎస్ జిమ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్ పట్టి కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకే ఇటువంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కలు వేయించాలి
భారీ అవగాహనా ర్యాలీలో డిఎంహెచ్ఒ డాక్టర్ అమృతం



ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం పిలుపునిచ్చారు. ఏలూరులో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డిఎంహెచ్ఒ కార్యాలయం నుండి ప్రారంభమై పాండురంగాపురం మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. అక్కడ సిబ్బందితో కలిసి మానవహారం నిర్వహించి, పోలియో నిర్మూలనపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అమృతం మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల 2,00,004 మంది చిన్నారులను గుర్తించామని, వారందరికీ చుక్కలు వేయడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలియో కేంద్రాలు జిల్లావ్యాప్తంగా 1,709 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ కోసం 7,258 మంది సిబ్బందిని నియమించామని అన్నారు. సుమారు 2,44,040 డోసుల వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచామని, జిల్లాలో 350 హైరిస్క్ ఏరియాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామ సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లోనూ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డిఎంహెచ్ఒ వెల్లడించారు. ఇప్పటికే చుక్కలు వేయించిన పిల్లలకు కూడా రేపు మరోసారి తప్పనిసరిగా వేయించాలని ఆమె తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. 'నిండు జీవితానికి రెండు చుక్కలు' అనే నినాదంతో భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శోభ, వివిధ విభాగాల అధికారులు, డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉలుకు.. పలుకూ లేదాయే..!

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం కలపడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఉపాధి హామీ చట్టంలో పెనుమార్పులు రెండు జిల్లాల్లో తీవ్ర చర్చనీయాంశమవ్వగా.. హేలాపురి, భీమవరం బాలోత్సవాలు ప్రజల్లో ఆసక్తి రేకెత్తించాయి.



పోలవరం జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలై రోజులు గడుస్తుంది. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకుండా పోవడం ఏమిటని అక్కడి ప్రజలు నాటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. తాజాగా ఈ నెల 22న బంద్‌కు సైతం పోలవరం జిల్లా సాధన కమిటీ పిలుపునిచ్చింది. ప్రధానంగా ఎన్నికల ముందు పోలవరం ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసిత ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలు కలిపి జిల్లాగా ప్రకటిస్తామని చంద్రబాబే హామీ ఇచ్చారు. ప్రధానంగా నిర్వాసితులంతా ఒక జిల్లా పరిధిలో ఉంటే వారి సమస్యల పరిష్కారంలో ఎటువంటి సమస్యలూ ఉండవని సైతం నాడు ముక్తాయించారు. అయితే జిల్లా ప్రకటనలో మాత్రం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా అని పెట్టినా, అందులో పోలవరం నియోజకవర్గమే లేకపోవడంపై అంతా కంగుతిన్నారు. తుది గెజిట్ విడుదల చేసేలోపు ప్రభుత్వం మార్పు చేస్తుందా, లేక నోటిఫికేషన్‌కే పరిమితమవుతుందా అనే చర్చ సర్వత్రా సాగుతుంది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు ఇప్పటికే జిల్లా సాధన కమిటీగా ఏర్పడి ఆందోళన చేస్తున్నాయి. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఈ అంశాన్ని పవన్‌కళ్యాణ్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పడం మినహా మిగిలిన ప్రజాప్రతినిధులెవ్వరూ దీనిపై నోరుమెదపకపోవడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలోనే ఈ నెల 22న మన్యం బంద్ విజయవంతానికి విస్తృత ప్రచారం చేశారు. ఈ బంద్ పట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.

ఉపాధి హామీ చట్టంలో మార్పులపై రెండు జిల్లాల్లో ఉపాధి కూలీలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరు మార్పుకన్నా ఆ చట్టంలో నిబంధనలు సమూలంగా మార్చడం తమ పొట్ట కొట్టడమేనని భగ్గుమంటున్నారు. ప్రధానంగా ఇప్పటికే కేంద్రం బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయింపు తగ్గిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే పనులు చేసిన తర్వాత నెలలు తరబడి సొమ్ము కోసం వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే వేతనం వస్తుందనే ధీమాతో ఉన్నదాంతో సరిపెట్టుకోవడం, లేక అప్పు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తాజాగా కేంద్రం నిధుల వాటా 90 నుంచి 60 శాతానికి తగ్గించి, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలనడం కచ్చితంగా ఉపాధి హామీ ఊపిరి తీసినట్లేనని అంతా అభిప్రాయపడుతున్నారు. ఇక వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు పనులు ఆపాలనే నిబంధన సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఇప్పటికే వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం, యాంత్రీకరణ వల్ల పనులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో ఉపాధి హామీకి నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించడం, కేంద్రం వాటా తగ్గించడం పేదల సంక్షేమం పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతోంది.

రెండు జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బాలోత్సవాలు విజయవంతమయ్యాయి. భీమవరం బాలోత్సవానికి కలెక్టర్, ఎస్‌పి, ఇతర ప్రముఖులు హాజరవ్వడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రధానంగా కలెక్టర్ కొద్దిసేపు బాలలతో గడపడం అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుత యాంత్రిక పని విధానంలో ఎవరికైనా మానసికోల్లాసం అత్యంత అవసరం. అదీ బాలలకైతే మరింత అవసరం. వారి ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసేలా, ప్రతిభను ప్రోత్సహించేలా ఇటువంటి బాలోత్సవాలు మరిన్ని నిర్వహించాలని విచ్చేసిన వక్తలు, ప్రముఖులు ముక్తాయించడమే దీనికి నిదర్శనం. ఇదే క్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు బాలోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలిరావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రస్తుతం కొన్ని పట్టణాలకే పరిమితమైన ఈ బాలోత్సవాలను రెండు జిల్లాల్లో మరిన్ని కేంద్రాలకు విస్తరించాలని, బాలల మనోవికాసానికి, ప్రతిభ ప్రోత్సాహనికి వేదిక కావాలని ఆశిద్దాం.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

రేపు మన్యం బంద్ జయప్రదం చేయాలి

ద్విచక్ర వాహనాలతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలవరం సాధన కమిటీ నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని చేర్చాలని కోరుతూ ఈనెల 22న చేపట్టే మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని పోలవరం జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యాన మండలంలోని అంకన్నగూడెం నుంచి రాచన్నగూడెం, కామయ్య పాలెం, పి.అంకంపాలెం, బర్రింకలపాడు, తాటియాకులగూడెం, వంకావారిగూడెం, జీలుగుమిల్లి వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించినట్లు పోలవరం జిల్లా సాధన కమిటీ నాయకులు తెల్లం రామకృష్ణ తెలిపారు. అనంతరం వ్యాపార దుకాణ దారులకు బంద్‌కు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం పేరుతో ఏర్పడే రంపచోడవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం చేర్చకపోవడం బాధాకరమని అన్నారు. రంపచోడవరం, పోలవరం నియోజకవర్గం కలిపి ప్రత్యేక జిల్లాగా చేయాలని తదితర సమస్యలపై ఈనెల 22న చేపట్టే మన్యం బంద్‌లో ప్రజా సంఘాలు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, బోడెమ్మ, గంగరాజు, వెంకటేశ్వరరావు, వెంకన్న, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు సిఐటియు మద్దతు

ఈనెల 22వ తేదీ సోమవారం జరిగే మన్యం బంద్‌కు సిఐటియు మద్దతు ఇచ్చినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బంది కొరత!

ప్రభుత్వ సేవలందక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి



సిబ్బంది లేక తాళం వేసి ఉన్న సచివాలయం

చింతలపూడి నగర పంచాయతీలోని సచివాలయంలో అసలు సేవలు ప్రజలకు అందుతున్నాయా? లేదా? అనే సందేహం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది లేక ప్రజలు ప్రభుత్వ పథకాలు పెట్టుకోవటానికి అవకాశం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల స్థలాలు, ఇతర సేవలకు సచివాలయాల చుట్టూ తిరిగి ప్రజలు అలసిపోతున్నారు. సచివాలయానికి సిబ్బంది లేక తాళాలు వేస్తున్న పరిస్థితి నెలకొంది. సచివాలయంలో సిబ్బంది లేక, ప్రజలకు సేవలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టారా? ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోరా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యలో సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్ తర్వాత నగర పంచాయతీలో ఏర్పడిన సిబ్బంది కొరత నేటి వరకు అదే పరిస్థితి కొనసాగుతుంది. నగర పంచాయతీలో ఉన్న అన్ని సచివాలయాల పరిస్థితి దాదాపు అంతే. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి, చింతలపూడి నగర పంచాయతీల్లో సిబ్బంది కొరతకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రేపు ఏజెన్సీ బంద్

కుక్కునూరు : ఈనెల 22న సోమవారం జరిగే ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు శ్యామల లక్ష్మణరావు, గిరిజన జెఎసి నాయకులు వర్స నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో బంద్ జయప్రదం కోరుతూ కాక ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు, ఎటిపాక, కూనవరం, విఆర్.పురం, దేవిపట్నం పోలవరం నియోజకవర్గంలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు ప్రజలు నిర్వాసితులవుతారన్నారు. ఈ ప్రాంతమంతా ఒకే కార్యనిర్వాహక యూనిట్‌గా ఉండటం అవసరమని తెలిపారు. ఇందువల్ల నిర్వాసితులకు పునరావాసంతో పాటు ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడానికి తోడ్పడుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంత(షెడ్యూల్) చట్టాల అమలుకు, ఆదివాసీలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుంది. రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలు రెండూ ఎస్‌టి నియోజకవర్గాలే కాబట్టి పోలవరం ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ప్రభుత్వం పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసి ప్రాంతాన్ని చేర్చేలే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ బంద్‌కు మండల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు కో కన్వీనర్ మహమ్మద్ వలిపాషా, కంటిపల్లి రామకృష్ణ, సీలం లక్ష్మయ్య, ఎంపిటిసి సాధు పాల్గొని మద్దతు తెలియజేశారు.

రహదారుల నిర్మాణానికి నిధులు

ద్వారకాతిరుమల : గోపాలపురం నియోజకవర్గ ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రత్యేక కృషితో, టిడిపి మండల అధ్యక్షులు లంకా సత్యనారాయణ చొరవతో మండలంలో ఎస్ఎఎస్‌పిఐ నిధులతో 2 ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.10 కోట్ల 18 లక్షల నిధులు మంజూరు అయ్యాయని టిడిపి సీనియర్ నాయకుడు పాకలపాటి గాంధీ తెలిపారు. తిమ్మాపురం నుంచి వీరిశెట్టి గూడెం రోడ్ వరకు 6.4 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణంకు రూ.3 కోట్ల 58 లక్షలు, గొల్లగూడెం నుంచి మరంపల్లి వరకు 10.2 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్ల 60 లక్షల నిధులు మంజూరు అయినట్టు పంచాయతీరాజ్ ఇఇ కె.శ్రీను తెలిపారు. వాటి అంచనాల తయారీకి శనివారం రోడ్లను స్థానిక నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాకలపాటి గాంధీ, దేవరపల్లి వీరస్వామి చౌదరి, సొసైటీ ఛైర్మన్‌లు బొబ్బ రాము, మాసిరెడ్డి హరిబాబు, మండల నాయకులు నాదెళ్ల వేణు, పాకాలపాటి మాణిక్యాలరావు, గ్రామ అధ్యక్షులు కమ్మ సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఎఇలు, మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో అకస్మాత్తుగా మంటలు

ముదినేపల్లి: పొలంలో పనిచేస్తున్న ట్రాక్టర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ట్రాక్టర్ పాక్షికంగా ధ్వంసమైన సంఘటన శుక్రవారం మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పంట పొలంలో పనిచేస్తున్న తిట్ల బాలకృష్ణ అనే రైతు ట్రాక్టర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ట్రాక్టర్ పాక్షికంగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సర్పంచి గంటా రాకేష్ కుమార్, విఆర్ఒ శ్యామ్ ఘటనా స్థలానికి వెళ్లి రైతుని వివరాలు అడిగి తెలుసుకుని మండల తహశీల్దార్ లతీఫ్ పాషాకు సమాచారం అందించారు.

జెడ్‌పి బోయ్స్ హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్

నూజివీడు టౌన్ : నూజివీడు మండల వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డివిఎల్.పుష్పలత, ఎంఇఒ-2 జయలయ్య పాల్గొని మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ వల్ల క్రీడాకారులకు మెళకువలు నేర్పించడం, మారిన రూల్స్‌ను, కొత్త టెక్నిక్స్‌ను తెలుసుకొని విద్యార్థులకు బోధించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కాంప్లెక్స్ వ్యాయామ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అన్ని విషయాలు చర్చించుకొని, తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఉన్నమట్ల ఎలిజా

చింతలపూడి: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సెంట్రల్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని సీతానగరం పంచాయతీ సీతానగరం గ్రామంలో రాఘవపురం సొసైటీ మాజీ ఛైర్మన్ అబ్బులు మామ అడపా నరసింహారావు ఇటీవల కాలంలో కీర్తిశేషులయ్యారు. వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నేరస్తులకు 'మార్పు' గొప్ప అవకాశం

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి : నాటుసారాయి వృత్తిని వీడి సమాజంలో నిలదొక్కుకోవాలనే సంకల్పంతో ముందుకు వస్తున్న పౌరులకు ప్రభుత్వం అందిస్తున్న 'మార్పు' కార్యక్రమం గొప్ప సహాయాన్ని అందిస్తోందని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఇది వారి ఆదాయాన్ని పెంచి, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తుందన్నారు. 'నవోదయం 2.0' గ్రామీణ అభివృద్ధి దిశగా ఒక ముఖ్యమైన అడుగు అన్నారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో శనివారం 'నవోదయం 2.0 మార్పు' కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా వృత్తి మానిన కుటుంబాలకు రుణాల మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ గతంలో నాటుసారా తయారీ, విక్రయం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాల్లో నిమగ్నమైనప్పటికీ, ప్రస్తుతం ఆ వృత్తిని పూర్తిగా మానుకొని చట్టబద్ధ జీవన విధానాన్ని అవలంబిస్తున్న కుటుంబాలకు పునరావాసం, ఆర్థిక స్థిరత్వం, ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం అన్నారు. కార్యక్రమంలో కెవిఎన్.ప్రభుకుమార్, అసిస్టెంట్ కమిషనర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ జి.పాండురంగారావు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎపిడి మహాలక్ష్మి, అనిత కమల కృపానందం పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ చింతలపూడి, అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఆవులయ్య ఆదేశాల మేరకు నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా పాత నేరస్తులను ముసునూరు తహశీల్దార్ డి.ప్రశాంతి వారి ఎదుట హాజరు పరచి వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఈ బైండోవర్ ఒక సంవత్సరం కాలపరిమితి ఉంటుందని, ఈ సంవత్సరం కాల పరిమితిలో మరలా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వ పథకాలను రద్దు చేయడం జరుగుతుందని పాత నేరస్తులను హెచ్చరించారు.

పోలవరం : ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం పోలవరంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం అన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్పుడే దేశం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు. ప్రొహిబిషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ పి.సునీల్ కుమార్, కానిస్టేబుల్ ఎ.రాజేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనం కోసమే పేరు మార్పు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకోం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు కాపీలు దగ్ధం



బిల్లు కాపీలను దగ్ధం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్లమెంట్‌లో కొత్తగా మార్చిన వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు 2025ను వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బిల్లు కాపీలను దగ్ధం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎస్.శివాజీ మాట్లాడుతూ 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' బిల్లును, ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుతో మార్చి యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం, ఆర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యారంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్యీకరించడానికి, మతతత్వీకరించడానికి ప్రయత్నిస్తోందనీ, కేంద్ర ప్రభుత్వ ఈ వికృత ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నమే ఈ చర్య అని విమర్శించారు. ఈ బిల్లు ఆమోదం వల్ల భారతదేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు, పరిశోధనలో భారీ మార్పులు వస్తాయని, ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రజలు, మేధావులు, విద్యార్థి సంఘాల నుండి వచ్చిన తీవ్ర విమర్శలను బేఖాతరు చేస్తూ ఈ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని సూచిస్తోందని, రాష్ట్రాల్లోని విద్యా సంస్థలపై కేంద్రం తన భావజాలాన్ని రుద్దడానికి, వాటిపై పట్టు సాధించడానికి ఈ మార్పును ఒక సాధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని, భావజాల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యారంగాన్ని నడపడానికి ఇది ఒక యంత్రాంగంగా మారుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఈ ఏకపక్ష చర్యను తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి లోకం, సామాన్య ప్రజలు ఈ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు ఎం.జయంత్, సహాయ కార్యదర్శి ఎం.శివ, కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, అభి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నివారణపై శనివారం ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ప్రజలు డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుత భాగస్వామిగా మారాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ర్యాలీ సందర్భంగా ప్రజలకు వాయు కాలుష్య నివారణ, పర్యావరణ సంరక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహనుండాలి

ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి

జీలుగుమిల్లి: ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ప్రజాప్రతినిధులకు, అధికారులకు పీసా చట్టంపై అవగాహన ఉండాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో మూడు రోజుల పాటు అధికారులకు, సర్పంచిలు, ప్రజాప్రతినిధులకు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు, సచివాలయ సిబ్బందికి పీసా చట్టంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసే ప్రజాప్రతినిధులకు పీసా చట్టం, పీసా గ్రామసభలపై అవగాహన ఉండాలని తెలిపారు. పీసా కమిటీకి సంబంధించి పలు అంశాలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాల సందర్శన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రతిభ పాఠశాల ప్రాంగణంలో ప్రముఖ ఐఎఎస్ అధికారి ఎంవి.రావు(1988 బ్యాచ్, పశ్చిమ బెంగాల్ కేడర్) ఆయన సతీమణి పద్మశ్రీకి పాఠశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అతిథులను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఎంవి.రావు మిడ్నాపూర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ ప్రజాపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. అనంతరం జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్‌డి) డైరెక్టర్ జనరల్‌గా సేవలందిస్తూ గ్రామీణాభివృద్ధి విధానాల రూపకల్పనలో విశేషంగా కృషిచేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవా జీవితం నిజాయితీ, సరళత, కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంవి.రావు సివిల్ సర్వీసుల లక్ష్యం, దేశసేవలో అధికారుల పాత్ర, క్రమశిక్షణ, నిరంతర శ్రమ ప్రాముఖ్యతపై విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తత అవసరం

మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ఎ.ప్రసాద్

ప్రజాశక్తి - టి.నరసాపురం



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ఎ.ప్రసాద్ తెలిపారు. టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెడ్లం విలేజ్ హెల్త్ క్లినిక్ ఏరియాలోని ప్రజలకు స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వ్యాధి లక్షణాలు, ఎలా వ్యాప్తి చెందుతుంది, నివారణ చర్యలపై ప్రజలకు వివరించారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు తెలియజేశారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సొంగా సిద్దయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఎఎన్ఎం నర్మదా, ఆశా వర్కర్ మరియమ్మ పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

ప్రజాశక్తి - పోలవరం



పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి చిన్నారికి విధిగా పోలియో డ్రాప్స్ వేయాలని ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చేగొండపల్లి గ్రామంలో శాప్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోలియో డ్రాప్స్ ద్వారా శిశువులను పోలియో బారిన పడకుండా కాపాడవచ్చని తెలిపారు. చిన్న వయస్సులోనే పోలియో నివారణ చేపడితే పిల్లల భవిష్యత్తును వైకల్య రహితంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. నేటికీ అనేక మంది పోలియో కారణంగా శారీరక వైకల్యాలతో జీవిస్తూ సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మరలా పునరావృతం కాకుండా ప్రభుత్వం డిసెంబరు 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో ఆదివారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు. తమ పరిసరాల్లోని ప్రతి చిన్నారికి పోలియో డ్రాప్స్ వేయించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోలియో పూర్తిస్థాయిలో నిర్మూలనకు ప్రజల సహకారమే కీలకమని, సమాజం మొత్తం ఒకటిగా ముందుకు వస్తేనే ఆరోగ్యవంతమైన తరతరాలు సాధ్యమవుతాయని జగదీశ్వరి అన్నారు.

నిధుల మంజూరుకు కూటమి ప్రభుత్వం సహకరించాలి : ఎంపిపి

భీమడోలు : మండల పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు కావడం లేదని, కనీసం ఎంపిటిసిలకు చెల్లించవలసిన గౌరవ భృతి సైతం విడుదల కావడం లేదని, కూటమి నాయకులు ఈ విషయమై సహకరించాలని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కె.రామయ్య కోరారు. ఆయన అధ్యక్షతన భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో ఎంపిడిఒ పద్మావతి దేవి, తహశీల్దార్ బి.రమాదేవి సహకరించారు. మండల పరిషత్ అధ్యక్షులు ఆరోపణపై సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు స్పందించారు. అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ ధర్మరాజు, ఎంపీ పుట్టా మహేష్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు విడిగా నిధులు కేటాయిస్తున్నారని వివరించే ప్రయత్నం చేశారు. కార్యక్రమం ప్రారంభం కాగానే విద్యుత్ శాఖ వైఫల్యాల గురించి పలువురు సభ్యులు ప్రశ్నించారు. భోగాపురం గ్రామంలో విద్యుత్ కండక్టర్ల మార్పుకు, అవసరమైన చోట నూతన స్తంభాల ఏర్పాటుకు నిధులు విడుదలైనప్పటికీ విద్యుత్ అధికారుల నిర్లిప్తత కారణంగా పనులు కొనసాగడం లేదన్నారు. ఇదే పరిస్థితి ఆగడాల లంకలో సైతం కొనసాగుతుందని ఎంపిపి ఆరోపించారు. గుండుగొలను సొసైటీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు, వీటికి అదనంగా ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ కేటాయించిన పనులు పూర్తిచేయని కారణంగా కొల్లేరు లంక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి కొనసాగుతుందన్నారు. ఉపాధి హామీ బకాయిలు చెల్లింపు విషయమై కూలీలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇదేవిధంగా గృహనిర్మాణ సంస్థల లబ్ధిదారులకు సైతం ఇదే తరహా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఇక కొల్లేరు విషయానికి వస్తే ఐదవ కాంటూరుకు దిగువన గల జిరాయితీ భూముల్లో సాగు కోసం ప్రయత్నం చేస్తున్న లబ్ధిదారులను వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు మండలంలో ఇబ్బంది పెడుతున్నారని కొందరు సభ్యులు ఆరోపించారు.వీటిపై స్పందించిన ఎంపిడిఒ పద్మావతి దేవి గతంలో మంజూరై పనులు, ప్రారంభం కానీ పనులకు చెందిన నిధులను వీటికి మళ్లించవచ్చని ఎంపిపి దృష్టికి తెచ్చారు. ఈమేరకు తీర్మానం చేసి తక్షణమే పనులు ప్రారంభించేందుకు మండల పరిషత్ తీర్మానించింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ శేషగిరి పాల్గొన్నారు.

పలుచోట్ల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



ఏలూరు అర్బన్ : రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన..

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


ఏలూరు సిటీలో..

చెత్త నుండి కూడా సంపద సృష్టించాలనే అద్భుత ఆలోచనలకు మెరుగులు దిద్దుతూ వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, ఆదిశగా సత్ఫలితాలను రాబట్టేందుకు విజయవంతమైన ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ వస్తోందని ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఆ ప్రయత్నంలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతినెలా 3వ శనివారం క్రమం తప్పకుండా లక్ష్యసాధన దిశగా కొనసాగుతోందన్నారు. దీనిలో భాగంగా ఈ శనివారం పర్యావరణంలోని అవకాశాలు అనే థీమ్‌తో స్థానిక 28వ డివిజన్‌లో చేపట్టిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసిన ఆయన మొక్కలను నాటారు. అలాగే స్వయంగా చీపురు పట్టి, రోడ్లను ఊడ్చి అక్కడి ప్రజల్లో, పారిశుధ్య సిబ్బందిలో స్ఫూర్తిని నింపారు. అదేవిధంగా పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తొలుత ఇటీవల మృతిచెందిన నగరపాలక సంస్థ అవుట్ సోర్సింగ్ కార్మికుడు రమేష్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రమేష్ భార్యకు ఆర్థిక సాయాన్ని అందించి, అన్నివిధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చేపట్టాల్సిన చర్యలను, ఆవశ్యతను వివరించారు. పనికిరాని వస్తువులను ఆదాయ వనరులుగా మార్చుకోవడంలోనే సమర్థత దాగివుందన్నారు. తద్వారా ఖర్చులను అనేకం తగ్గించుకోవచ్చునంటూ ఉదాహరణలతో విపులీకరించారు. ఆయన వెంట రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, నగరపాలక సంస్థ విప్, కార్పొరేటర్ తంగిరాల అరుణ, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, నాయకులు తంగిరాల సురేష్, ఆర్నేపల్లి తిరుపతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ పాల్గొని స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.


పోలవరం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పోలవరం : మండలంలోని బోడిగూడెం ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వింజరం గ్రామ సర్పంచి కొక్కెర వెంకట లక్ష్మి ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ, ఆర్థిక సాధికారత లక్ష్యంగా పర్యావరణ రంగాలలో స్వయం ఉపాధి, వ్యవస్థాపక అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో నైపుణ్యాభివృద్ధి మార్గాలు, వ్యర్థాల సేకరణ రవాణా వనరుల పునరుద్ధరణ అంశాలపై వివరించారు. పర్యావరణ సమస్యలకు స్థానిక పరిష్కారాలు కనుగొనేందుకు యువత ముందుకు రావాలని, ఇందుకోసం నెట్‌వర్కింగ్ ఈవెంట్లు, ఆవిష్కరణ సవాళ్లు, వివిధ పోటీల నిర్వహణ ఎంతగానో అవసరమని పేర్కొన్నారు. బోడిగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యా రామదాసు, పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ బిలాల్, సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఏలూరు అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ, మానవత, ఆదిత్య డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన శనివారం రెడ్ క్రాస్ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్, స్వచ్ఛ ఏలూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎంవివిఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించడం వంటి కార్యక్రమాలు చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ స్వచ్ఛ-ఆంధ్ర స్వచ్ఛ ఏలూరు కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రెడ్ క్రాస్ వలంటీర్లు, మానవత సభ్యులు, ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినీలు రెడ్ క్రాస్ ప్రాంగణాన్ని పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు అజయ్ బాబు, టి.రామారావు, మానవత సభ్యులు కనకదుర్గ, ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రస్తుత కాలంలో పర్యావరణ పరిరక్షణ కేవలం బాధ్యత మాత్రమే కాకుండా, యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించే రంగంగా మారిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో పర్యావరణంలో అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పునరుత్పాదక శక్తి వనరులు, గ్రీన్ జాబ్స్ వంటి రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యూనిట్ సభ్యులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

ఉంగుటూరు : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంలో భాగంలో గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామస్థులు సహకారం అందించాలని ఎంపిడిఒ గంజి రాజ్ మనోజ్ అన్నారు. శనివారం నారాయణపురం సచివాలయం-2 వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి దిడ్ల అలకనంద అధ్యక్షత వహించారు. తడి పొడి చెత్తలను వేర్వేరుగా అందివ్వాలన్నారు. ఉపసర్పంచి మరడ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి నేతల విజయ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురం గ్రామంలో సిఎస్ఐ చర్చి ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను పాస్టర్ బెన్హర్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు పొట్లూరి కృష్ణవేణి, కొర్లకుంట టిడిపి యూనిట్ కన్వీనర్ పొట్లూరి మహేంద్ర వర్మ పాల్గొన్నారు.